# ఈతిబాధ

రచన: రమామనోహర్

భీమేశ్వరరావుగారు తను యింటర్మీడియటు పరీక్ష ప్యాసయింది మొదలు... కాలేజిలో జేరేదాకా చేసిన ధీరకృత్యాలు నాకు పదహారోసారి వినిపిస్తున్నారు.

నేను గొఱ్ఱెపొట్టేలులాగా తలవూగిస్తూవింటున్నాను.

చెపుతూ చెపుతూ ఆయన వెనుక వాడిన నాలుగు హాస్యపు ముక్కలే వాడి, ఆగి నావైపు చూశారు.

నవ్వు రాకపోయినా బలవంతంమీద తెప్పించుకొని వెకిలి నవ్వు నవ్వాను.

కొత్తవాళ్ళు ఎవరూ పరిచయం కాకపోవటం, అసలు మా క్లాసులో తెలుగువాళ్లే తక్కువమంది వుండటంవల్ల ఆయిన చెప్పే ప్రతిదానికి, కాలక్షేపంకోసం, వూకొడుతూ వుంటాను.

విషయం ఆఖరికి... పూర్తి చేసారు. మళ్లా మరొకటి ఎత్తుకోకుండానే దబ్బున సబ్బుబిళ్ల తువాల తీసుకొన్నాను.

"స్నానంచేసి వస్తానండి" అని చెప్పి బాత్ రూమ్‌లో పడ్డాను.

స్నానంచేసి వచ్చేసరికి ఆయన సూటులో రెడీగా వున్నారు.

"ఏమండోయ్, విశ్వనాధరావు మెడికల్ కాలేజిలో జేరాడుటండి. రూమ్ నంబరు 94 ట. వెళ్లి చూద్దాము రండి." అన్నారు.

ప్రాణస్నేహితుడొకడు అణాన్నర ట్రాము ఖర్చు దూరంలో వున్నాడని వినగానే ఎగిరి గంతేశాను. కాని నాకు బాగా తెలిసున్నంతవరకు విశ్వనాధరావుకీ, ఈయనకూ ఆటేపరిచయంలేదు. ఈయన అతన్ని చూడటానికి ఎందుకింత తొందరపడుతున్నాడో నాకు అర్థమవలేదు మొదట.

"విశ్వనాధరావు మీకు బంధువా అండీ?" అని అడిగాను.

"ఎబ్బే లేదండి, మనమందరము ఒకే కాలేజిలో చదివాంగదండీ అదే పరిచయం." అన్నారు.

నాకు తెలిసింది, ఈయన స్వంతం వెళ్లకక్కటానికి బయలుదేరారని. బయలుదేరాము యిద్దరము విశ్వనాధరావు రూముకు. మేము వెళ్లగానే విశ్వనాధరావు ముందర నన్ను పలకరించాడు. "ఏమిరోయ్, ఇక్కడే వున్నావేంటి? ఇన్నాళ్లబట్టి కనిపించంచలేదేం?" అని.

"నువ్వున్నావని తెలీదురా. ఇవాళే తెలిసింది." అన్నాను. ఊరికే భీమేశ్వరరావుగారిని కూడ పలకరించాడు. "మీరుకూడ ఇక్కడే చదువుతున్నారేమిటిటండీ? అని.

అంతే ఆఖరు. తరువాత మేమిద్దరము సంభాషణ మొదలు పెట్టాము.

ముందర వాడు సెలవలు ఎల్లా గడిపింది వర్ణించాడు. నేను నా సొద వాగాను.

పాత స్నేహితుల సంగతి వచ్చింది. "రామారావు కాశీలో ఇంజనీరింగు చదువుతున్నాడురా" అని వాడు చెప్పాడు. రామారావు సంగతి చాలాసేపు మాట్లాడాము.

పాపం భీమేశ్వరరావుగారికి రామారావు రంగు కూడా తెలీదు. రామారావు గొడవ తర్వాత, కృష్ణమూర్తి, వేంకటనారాయణ సీతాపతి, శాస్త్రి-వీళ్ళనుగురించి సంభాషణనడిచింది. వీళ్ళల్లో ఒక్కర్ని కూడ భీమేశ్వరరావుగారు ఎరగరు.

మేము బాతాఖాని కొడుతున్నంతసేపు, భీమేశ్వరరావుగారు మావైపు గుడ్లు వప్పగించి, నోరు తెరచి చూస్తూ కూచోని వూరుకొన్నారు. మధ్యలో ఆయన రెండుమూడు సార్లు కల్పించుకొని మాట్లాడపోయారు. కాని విశ్వనాధరావు వాక్ప్రవాహం ముందర ఆయన ధోరణి సాగిందికాదు.

చివరకు తెగించి "నేనసలు మద్రాసు వద్దామనుకోలేదండి..." అని మొదలెట్టపోయారు విశ్వనాధరావు వైపు తిరిగి. వాడు అంతవరకు విని "అల్లాగా" అని, వెంటనే నావైపు తిరిగి "అన్నట్టు మీ మేనమామ ఇప్పుడేం చేస్తున్నాడురా?" అని అడిగాడు.

మేనమామను గురించి నే చెప్పటం పూర్తి